



భజన బడ్జెట్

- ఆద్యంతం గొప్పలు చెప్పుకున్న మంత్రి బుగ్గన
- కర్నూలు ఎయిర్‌పోర్టు వైసీపీ ప్రభుత్వమే నిర్మించిందట
- ఐదేళ్లయినా ప్రారంభానికి నోచుకోని క్యాన్సర్ యూనిట్
- అవుకు టన్నెల్, నీటి ప్రాజెక్టులపై అవే అబద్ధాలు
- ఆర్థిక మంత్రి బుగ్గన అంకెల పద్దు ఇది

ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రానుండడంతో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తరహాలో ఓటర్లను ఆకట్టుకునేలా బడ్జెట్ ఉంటుందని ఆశించారు. అయితే బుగ్గన బడ్జెట్ ప్రసంగం ఆద్యంతం జగన్ ప్రభుత్వంపై గొప్పలు చెప్పుకోవడానికే సరిపోయింది. అంకెలు.. కోతలు తప్ప జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వలేదు. జగన్నాథ గట్టుపై పది కిలో మీటర్లు కనబడేలా హైకోర్టు నిర్మించబోతున్నామని గొప్పగా చెప్పారు. అయితే 15 నెలలు గడిచినా ఇక్కడ ఒక్క ఇటుక కూడా పడలేదు. చివరి బడ్జెట్ కావడంతో హైకోర్టుకు ప్రాధాన్యత ఇస్తారని ఆశించిన సీమ వాసులకు నిరాశే మిగిల్చారు. కర్నూలు విమానాశ్రయం, హంద్రీ నీవా నుంచి 68 చెరువులకు కృష్ణా జలాలు ఎత్తిపోతల పథకం తామే చేసినట్లుగా కోతలు కోశారు. అసంపూర్తిగా ఉన్న అవుకు రెండవ టన్నెల్‌ను హడావుడిగా సీఎం జగన్ చేత ప్రారంభించి 10 వేల క్యూసెక్కులు ఇచ్చినట్లు గొప్పలు చెప్పారు. బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు ఆపేస్తే రాయలసీమ దుర్భిక్ష నివారణ పనులు జరుగుతున్నట్లు జనం కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం చేశారు. బుగ్గన అంకెల పద్దుపై ప్రత్యేక కథనం.

కర్నూలు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు కర్నూలు నగరంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయబోతున్నామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అంతలోనే ఎన్నికలు రావడం, జగన్ ప్రభుత్వం కొలువుదీరడం చకచకా జరిగాయి. అయితే కర్నూలును న్యాయ రాజధాని చేస్తామని జగన్ ప్రగల్భాలు విని జిల్లా ప్రజలు సంబరపడ్డారు. హైకోర్టు వస్తుందని ఆశించారు. 2022 డిసెంబరు 5న ఎస్టీబీసీ మైదానంలో 'రాజకీయ పార్టీలు-విద్యార్థి జేఏసీ' పేరిట అధికార పార్టీ నిర్వహించిన రాయలసీమ గర్జన సభలో జిల్లాకు చెందిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన ఎటువైపు నుంచి కర్నూలుకు వచ్చినా పది కిలోమీటర్లు కనిపించేలా జగన్నాథ గట్టుపై హైకోర్టు నిర్మిస్తామని కోతలు కోశారు. ఆర్థిక మంత్రి పైగా ప్రభుత్వంలో ద్వితీయ స్థానంలో ఉండడంతో హైకోర్టు నిర్మాణం మొదలవుతుందేమో..! అని న్యాయవాదులు, విద్యార్థులు, యువకులు భ్రమ పడ్డారు. 15 నెలలు గడిచినా ఆ ఊసే లేదు. ఇక చివరి బడ్జెట్ ప్రసంగంలోనైనా ప్రాధాన్యత ఇస్తారని ఆశిస్తే బుగ్గన ఆ ఊసే ఎత్తకుండా జిల్లాకు మొండిచేయి చూపారు.

ప్రాజెక్టు చంద్రబాబుది.. గొప్పలు బుగ్గనవి!

జిల్లాలో అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన పత్తికొండ, డోన్, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాల్లో 108 చెరువులకు హంద్రీనీవా కాల్వ నుంచి కృష్ణా జలాలు ఎత్తిపోస్తే ఆ ప్రాంతంలో కరువు శాశ్వతంగా నివారించవచ్చని గత టీడీపీ ప్రభుత్వంలోని డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి నాటి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఫేజ్-1 కింద 86 చెరువులకు 1.24 టీఎంసీలు ఎత్తిపోసి 10,130 ఎకరాలకు సాగునీరు అందించేలా రూ.224.31 కోట్లు మంజూరు 2018 అక్టోబరులో ఉత్తర్వులు జారీ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఆరు నెలల్లో రూ.65 కోట్లకు పైగా ఖర్చు చేసి 50 శాతం వరకు పనులు చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఐదేళ్లయినా వంద శాతం పూర్తి చేయలేదు. కొన్ని చెరువులకు మాత్రమే ఎత్తిపోసేలా పనులు చేసి సెప్టెంబరు 19న సీఎం జగన్‌తో ప్రారంభించారు. ఈ రోజుకి కూడా పత్తికొండ నియోజకవర్గంలో మెజార్టీ చెరువులకు పైపులైన్ పనులే పూర్తి కాలేదు. అయితే.. ఈ ప్రాజెక్టు వైసీపీ ప్రభుత్వమే చేపట్టి పూర్తి చేసినట్లు.. 10 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వడమే కాకుండా భూగర్భ జలాలు పెరిగాయని బుగ్గన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడంతో రైతులు ముక్కున వేలేసుకున్నారు.

ఎక్కడి పనులు అక్కడే

రాయలసీమ దుర్భిక్ష నివారణ పథకంలో భాగంగా రూ.3,825 కోట్లతో రాయలసీమ లిఫ్ట్, రూ.1,000 కోట్లతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ (పీఆర్‌పీ) నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు ఎస్ఆర్ఎంసీ కెనాల్, గాలేరు-నగరి వరద కాలువ సీసీ లైనింగ్, రూ.1,300 కోట్లతో గోరుకల్లు నుంచి అవుకు రిజర్వాయర్ వరకు జీఎన్ఎస్ఎస్ ఫ్లడ్‌ఫ్లో కెనాల్ సీసీ లైనింగ్, అవుకు మూడవ టన్నెల్ పనులు, రూ.1,800 కోట్లతో కుందు విస్తరణ, రాజోలి, జొలదరాశి రిజర్వాయర్ పనులు చేపట్టారు. బిల్లులు రాక లైనింగ్ పనులు, గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసు ఉండటంతో రాయలసీమ లిఫ్ట్ పనులు ఆగిపోగా, రాజోలి, జొలదరాశి రిజర్వాయర్ పనులు మొదలే కాలేదు. అయితే ఈ పనులు పురోగతిలో ఉన్నాయంటూ ఆర్థిక మంత్రి బుగ్గన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం కొసమెరుపు. అయితే తాగునీటి అవసరాల కోసం రాయలసీమ లిఫ్ట్ 6 పంపులు పనులు మాత్రమే జరుగుతున్నాయి. వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు పడకేశాయి. ఆయా ప్యాకేజీలకు దాదాపుగా రూ.1,500 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. అంతేకాదు.. మెడికల్ కాలేజీలు, క్యాన్సర్ యూనిట్లు నిర్మించినట్లు గొప్పలు చేప్పారు. ఆదోని, కర్నూలు మెడికల్ కాలేజీ పనులు నత్తతో పోటీపడుతున్నాయి. స్టేట్ క్యాన్సర్ యూనిట్ పనులు టీడీపీ ప్రభుత్వంలో చేపడితే.. ఐదేళ్లకు భవనం మాత్రం 95 శాతం పూర్తి చేశారు. ఇప్పటికీ కీలకమైన క్యాన్సర్ చికిత్స యంత్రాలు రాలేదు.

బుగ్గన బడ్జెట్ గారడీ



ఆర్థిక మంత్రి బుగ్గన ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలు, పద్దులు తప్ప జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వలేదు. గారడీ మాటలతో ప్రసంగం ముగించారు. ఐదేళ్ల కాలంలో విభజన హామీలు ఒక్కటి కూడా పరిష్కరించకపోగా.. ఏదో సాధించినట్లు పచ్చి అబద్ధాలు మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా విస్మరించారు. అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టాలా ఉంది.

\- బి.గిడ్డయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి


వెనుకబడిన సీమకు తీరని ద్రోహం



బుగ్గన అంకెలు పద్దు చూస్తే రూ.2.86 లక్షల కోట్ల బడ్జెట్. వాస్తవానికి ఆమడ దూరంలో బడ్జెట్ ఉంది. రాయలసీమ అభివృద్ధి, ఉమ్మడి కర్నూలు జిల్లా పెండింగ్ ప్రాజెక్టులు ఊసే లేదు. కడప స్టీల్ ప్లాంట్‌కు కేటాయింపులు లేవు. గుండ్రేవుల, ఆర్డీఎస్ కుడి కాలువ, వేదావతి ప్రాజెక్టుల ప్రస్తావనే లేదు. వెనుకబడిన రాయలసీమకు తీరని ద్రోహం చేశారు.

\- గౌస్ దేశాయి, సీపీఎం జిల్లా కార్యదర్శి

హైకోర్టు మాటే ఎత్తలేదు



రాజధాని అమరావతిని చంపేయాలనే కుట్రలో భాగంగా మూడు రాజధానులు అంటూ ప్రజలను మభ్య పెట్టారు. కర్నూలులో న్యాయరాజధాని, హైకోర్టు అన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన చివరి బడ్జెట్‌లో కనీసం మాట మాత్రంగానైనా హైకోర్టు పేరెత్తలేదు. టీడీపీ ప్రభుత్వంలో 90 శాతం పూర్తి చేసిన ఓర్వకల్లు ఎయిర్ పోర్టును తామే చేపట్టి కట్టినట్లు, హంద్రీనీవా నుంచి 68 చెరువుకుల కృష్ణా జలాలు ఎత్తిపోతల ప్రాజెక్టులు వీళ్లే చేపట్టినట్లు బడ్జెట్ ప్రసంగంలో బుగ్గన అబద్ధాలు నిస్సిగ్గుగా చెప్పారు. జిల్లా ప్రాజెక్టుల ఊసే లేదు. ప్రసంగం అంతా అంకెల గారడీనే. రాబోయేది టీడీపీ ప్రభుత్వమే. పత్తికొండ చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన హామీ ప్రకారం కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం.

\- బీటీ నాయుడు, ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

కర్నూలు విమానాశ్రయం కట్టిందెవరు?

కర్నూలు నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో ఓర్వకల్లు కేంద్రంగా 33 వేల ఎకరాల విస్తీర్ణంలో ఇండస్ట్రియల్ హబ్ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పారిశ్రామిక ప్రగతి సాధించాలంటే విమానయాన రవాణా సౌకర్యం ఆవశ్యకతను గుర్తించిన నాటి సీఎం చంద్రబాబు కర్నూలు (ఓర్వకల్లు)గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 1,010 ఎకరాలు భూమి, రూ.110 కోట్లు నిధులు కేటాయించారు. 2017 జూన్ 21న శంకుస్థాన చేశారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ చరిత్రలోనే కేవలం 18 పూర్తి చేసి 2018 డిసెంబరు 31న హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరిన విమానం (ఫ్లైట్) ఓర్వకల్లు విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. ట్రయల్ రన్ దిగ్విజయం కావడంతో 2019 జనవరి 8న చంద్రబాబు ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఇది వాస్తవం. అయితే.. అప్పటికీ అసంపూర్తిగా ఉన్న 10-15 శాతం పనులు పూర్తి చేసిన తామే విమానాశ్రయం కట్టినట్లు.. విమాన సర్వీసులు ప్రారంభించినట్లు బడ్జెట్‌లో మంత్రి బుగ్గన గొప్పలు చెప్పుకుని నవ్వులపాలయ్యారు.



2019 జనవరి 8వ తేదీన సీఎం హోదాలో విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్న చంద్రబాబు

మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

శ్రీశైలం, ఫిబ్రవరి 7: శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి 11 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ అధికారులు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, మంచినీటి సరఫరా, ఆరుబయట ప్రదేశాల్లో విద్యుద్దీపాల ఏర్పాటు, చలువ పందిళ్ల ఏర్పాటు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు క్షేత్రానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. పోలీస్ శాఖ సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని ఆలయ భద్రతా విభాగాన్ని ఆదేశించారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు తగిన నీటి నిల్వ లేనందున షవర్ స్నానానికి ఏర్పాట్లు చేపట్టాలన్నారు. క్షేత్రంలోని ప్రధాన కూడళ్లలో తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి : కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: పెండింగ్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డా.జి. సృజన నోడల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై నోడల్ అధికారులపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఖచ్చితంగా ర్యాంపు, పోలింగ్ జరిగే గదిల్లో లైటింగ్, ఎలక్ట్రిఫికేషన్ వైరింగ్, టాయిలెట్స్ విత్ రన్నింగ్ వాటర్ ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా విత్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటవుతుందని, దీనికి ఫ్లగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమగ్ర శిక్ష అభియాన్ 487 పోలింగ్ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉండగా.. ఇంకా 1 పెండింగ్ ఉందని, ఏపీఈడబ్ల్యూఐడీసీ 283 పోలింగ్ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉండగా.. 281 పూర్తి చేశారని, ఇంకా రెండు పెండింగ్‌లో ఉన్నాయని, వచ్చే సోమవారం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కర్నూలు మున్సిపాలిటీకి 442 పోలింగ్ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉండగా.. ఇంకా 14 ర్యాంప్స్, 14 టాయి లెట్లు విత్ రన్నింగ్ వాటర్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి 82 పోలింగ్ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి 212 పోలింగ్ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉండగా.. ఇంకా 3 ర్యాంప్‌లు, 3 టాయి లెట్లు విత్ రన్నింగ్ వాటర్, 42 పోలింగ్ కేంద్రాలలో బాత్‌రూమ్ డోర్లు వేయించాల్సిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్‌కి సంబంధించి 420 పోలింగ్ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉండగా 416 పూర్తి చేశారని, మిగిలిన 4 త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్ రావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఏపీఈడబ్ల్యూ ఐడీసీ ఈఈ లక్ష్మీనారాయణ, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ విజయజ్యోతి, కర్నూలు, గూడూరు, ఆదోని మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డా.జి.సృజన

- కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల మౌలిక సదుపాయాలపై వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పచ్చజెండా

- కర్నూలు ఉమ్మడి జిల్లాలో 1,693 పోస్టులు
- టెట్, డీఎస్సీ వేర్వేరుగా నిర్వహణ
- ఈ నెల 12 నుంచి దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 7: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి పచ్చజెండా ఊపింది. టెట్, డీఎస్సీ నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేసేంది. కర్నూలు ఉమ్మడి జిల్లాలో 1,693 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి జిల్లా పాఠశాలల విద్యాశాఖ ప్రతిపాదనలు పంపింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయి. ఈ నెల 12న డీఎస్సీకి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే రోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలు కానుంది. టెట్, డీఎస్సీకి వేర్వేరుగా పరీక్షలు నిర్వహిస్తారు. టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులను డీఎస్సీకి అర్హులుగా ప్రకటిస్తారు. డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. టెట్, డీఎస్సీలకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు పేపర్-1, స్కూల్ అసిస్టెంట్లకు పేపర్-2 విడివిడిగా పరీక్షలు నిర్వహిస్తారు. బీఈడీ, నాలుగేళ్ల బ్యాచ్‌లర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ చదివిన వారు మాత్రమే అర్హులు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 1,693 పోస్టులు ఉండగా.. ఇందులో ఎస్జీటీ (1022), స్కూల్ అసిస్టెంట్లు (550), టీజీటీ (121) కలిపి 671 పోస్టులను భర్తీ చేయనున్నారు.



శ్రీశైలం చేరుకున్న కేఆర్ఎంబీ, ఎన్‌డీఎస్‌ఏ బృందం

శ్రీశైలం, ఫిబ్రవరి 7: శ్రీశైలం డ్యాం సందర్శనలో భాగంగా బుధవారం రాత్రి కేఆర్ఎంబీ, ఎన్‌డీఎస్‌ఏ బృందం సభ్యులు సున్నిపెంట జెన్‌కో అతిథి గృహానికి చేరుకున్నారు. శ్రీశైలం జలాశయం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, పలువురు ఇంజనీర్లు వీరికి స్వాగతం పలికారు. గురువారం ఉదయం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకోనున్నారు. అనంతరం జలాశయాన్ని చేరుకుని ఎన్‌డీఎస్‌ఏ ఛైర్మన్ వివేక్ త్రిపాఠి ఆధ్వర్యంలో సభ్యుల బృందంతో కలిసి జలాశయం భద్రత, నీటి నిల్వలు వినియోగం తదితర వాటిని పరిశీలిస్తారు. అనంతరం జలాశయం అధికారులతో సమీక్షా నిర్వహిస్తారు. అయితే శ్రీశైలం జలాశయం కేఆర్ఎంబీ పరిధిలోనికి తీసుకురానున్న నేపథ్యంలో బృందం సభ్యుల రెండు రోజుల పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది.

రైతు ద్రోహి జగన్ రెడ్డి

మండలిలో బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 7: జగన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తున్నదని శాసన మండలి ఉపనాయకుడు బీటీ నాయుడు అన్నారు. బుధవారం శాసన మండలిలో రైతుల సమస్యలపై వాయిదా తీర్మానాన్ని ఇవ్వగా మండలి ఛైర్మన్ తిరస్కరించడాన్ని తప్పుపట్టారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన రైతు సమస్యలపై చర్చించేందుకు గంటకు పైగా సమయమున్నప్పటికీ ఉభయ సభల్లో దానిని తిరస్కరించడాన్ని బట్టి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల పట్ల ఎంత వ్యతిరేకతతో ఉన్నదీ తేటతెల్లమైందన్నారు. రైతు సమస్యల గురించి, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల విషయం, విత్తనాలు, ఎరువులు, సాగునీరు వంటి అంశాలపై ఉభయ సభల్లో కోరితే టీడీపీ సభ్యులు పరిష్కార మార్గాలు చూపుతారని ప్రస్తావించగా దాన్ని తిరస్కరించారని అన్నారు. జాతీయ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వల్ల ప్రతి రైతు కుటుంబంపై రూ. 2,25,554 చొప్పున అప్పుపడిందన్నారు. రైతుల ఆత్మహత్యల్లో మన రాష్ట్రం 3వ స్థానంలో ఉందని, రైతు ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఉందని, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో 4వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు.

10 నుంచి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 7: స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీలను నిర్వహిస్తున్నట్లు కర్నూలు హాకీ కార్యదర్శి దాసరి సుధీర్ బుధవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిన నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి సబ్ జూనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిపితే చర్యలు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 7: అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. బుధవారం నంద్యాల జిల్లా మహానంది మండలం గాజుల పల్లె సమీపంలో సర్వే నెంబర్ 838లో 8,382 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాలు జరిపినట్లు గుర్తించామని తెలిపారు. విజిలెన్స్, గనులశాఖ సంయుక్తంగా జరిపిన విచారణలో బీ. సరసయ్య, బీ. వెంకటేశ్వర్లు అక్రమంగా తవ్వకాలు జరిపినట్లు తేలిందని, దీనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్‌యూకు కొత్త రెక్టార్, రిజిస్ట్రార్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 7: రాయలసీమ యూనివర్సిటీ పాలనా సౌలభ్యం కోసం కొత్తగా మార్పులు చేశామని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. నూతన రెక్టార్‌గా ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్‌గా యోగి వేమన యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఎ.అంకన్నలను నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా సీడీసీ డీన్‌గా ప్రొఫెసర్ సీవీ కృష్ణారెడ్డి, పరీక్షల విభాగం డీన్‌గా ప్రొఫెసర్ వెంకట సుందరానంద పుచ్చా, రీసెర్చ్ విభాగం, చీఫ్ వార్డెన్‌గా ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిలను నియమించామన్నారు.

పంచలింగాల చెక్‌పోస్టులో రూ.60 లక్షలు సీజ్



పట్టుబడిన నగదుతో పోలీసులు

కర్నూలు, ఫిబ్రవరి 7: కర్నూలు నగర శివారులో పంచలింగాల చెక్‌పోస్టులో కర్నూలు తాలుకా పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు చేపట్టారు. హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్తున్న కేఎస్ఎం ప్రైవేటు ట్రావెల్స్ బస్సును తనిఖీ చేయగా ఇద్దరి నుంచి రూ.60 లక్షల నగదును గుర్తించారు. నగదుతో పట్టుబడిన వారు బెంగళూరుకు చెందిన అనంత ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి చెందిన జిలాని, సుమన్‌లుగా గుర్తించారు. వీరి వద్ద ఈ నగదుకు సంబంధించిన ఎలాంటి రికార్డులు లభించలేదు. సీజ్ చేసిన ఈ నగదు మొత్తాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకుని ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో సీఐ శ్రీధర్, సెబ్ ఎస్ఐ పృథ్విరాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లస్కర్లకు పదోన్నతి

- 12 ఏళ్ల నిరీక్షణకు తెర
- శ్రీశైలం ముంపు బాధితులకు న్యాయం

కర్నూలు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న లస్కర్ల 12 ఏళ్ల నిరీక్షణ ఫలించింది. ఏకకాలంలో 39 మంది లస్కర్లకు పదోన్నతి కల్పిస్తూ జలవనరులు శాఖ ప్రాజెక్టుల సీఈ కబీర్‌బాషా కీలక నిర్ణయం తీసుకున్నారు. సీనియారిటీ, విద్యార్హతలను బట్టి 24 మందికి అటెండర్లుగా, 9 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా, ఐదుగురికి టైపిస్టులుగా, ఒకరికి జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు. శ్రీశైలం జలాశయం నిర్మాణంలో భాగంగా ఇళ్లు, భూములు కోల్పోయిన ముంపు బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి న్యాయం చేయాలనే సంకల్పంతో దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జీవో నంబరు 98 తీసుకొచ్చారు. ఆ జీవో మేరకు 2012లో దాదాపు 532 మందికి ఔట్ సోర్సింగ్ విధానంలో లస్కరు ఉద్యోగాలు ఇచ్చారు. అయితే తమను రెగ్యులర్ చేయాలని విన్నవిస్తూ వస్తున్నారు. అర్హతలు ఉన్నా ఏ ఒక్కరు స్పందించ లేదు. అయితే వీరి సమస్యపై స్పందించిన సీఈ కబీర్‌బాషా సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపించారు. అనుమతి తీసుకొని వారి విద్యార్హతలు, సీనియారిటీ ప్రకారం ఒకేసారి 39 మందికి పదోన్నతి ఇవ్వడం కొసమెరుపు. సీఈ తీసుకున్న కీలక నిర్ణయంపై పదోన్నతి పొందిన లస్కర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నలుగురికి ఐదేళ్ల జైలు శిక్ష

దేవనకొండ, ఫిబ్రవరి 7: మండలంలోని తెర్నేకల్ గ్రామానికి చెందిన బాటమీది రాజు, చిన్న వెంకప్ప, కొలంట్ల తిమ్మప్ప, బెల్లందొడ్డి చిన్న హనమంతులకు పత్తికొండ కోర్టులో మెజిస్ట్రేట్ ఐదేళ్లపాటు జైలు శిక్ష, రూ.18 వేల జరిమానా విధించినట్లు దేవనకొండ పోలీసులు తెలిపారు. 2014లో సూర్యనారాయణ అనే వ్యక్తిపై నిందితులు దాడి చేయడంతో వీరిపై కేసు నమోదైంది.

ఎండు మిరప ధర పతనం

- రెండు రోజుల్లో రూ.2 వేలు తగ్గిన వైనం
- ఆందోళనలో రైతులు



ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 7: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎండుమిరప ధర బుధవారం పతనమైంది. ఎండుమిరప ధర గరిష్ఠంగా క్వింటాలు రూ.20 వేలు పలికింది. రెండు రోజుల్లో క్వింటానికి గరిష్ఠంగా రూ.2 వేలకు పైగా ధర తగ్గింది. తెగుళ్లు, వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది మిరప దిగుబడి గణనీయంగా తగ్గిందని, వచ్చిన అరకొర దిగుబడి సైతం ధరలు పతనం అవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్యాడిగి రకం ఎండుమిరప క్వింటం గరిష్ఠంగా రూ.20,009 పలకగా, కడ్డీ బ్యాడిగి రకం రూ.18,009 పలికింది. 1,714 బస్తాలు ఎండుమిర్చి విక్రయానికి రాగా, వాటి క్వింటాలు కనిష్ఠ ధర రూ.5,889 గరిష్ఠ ధర రూ.20,009, మధ్యస్థ ధర రూ.16,205 పలికింది.

చిత్తగించిన 'గరుసు' దొంగలు

- వారిని పిలిపించి విచారిస్తాం
- అనుమతులు తప్పనిసరి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదోని రూరల్, ఫిబ్రవరి 07 : ఎట్టకేలకు గరుసు దొంగలు అరేకల్లు కొండల నుంచి చిత్తగించారు. ఆదోని వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి లెఫ్ట్ హ్యాండ్ గురునాథ్‌రెడ్డి అధికార అండదండలతో ప్రభుత్వ అనుమతి లేకుండా వందల లారీల మట్టిని అక్రమంగా అరేకల్లు కొండల నుంచి తరలిస్తున్నాడని బుధవారం ఆంధ్రజ్యోతి గరుసు దొంగల అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. దీనికి రెవిన్యూ అధికారులు స్పందించి అరేకల్లు కొండల్లోని మట్టి తవ్వకాల వద్దకు వెళ్లేలోపు సదరు అధికార పార్టీ గరుసు దొంగ వాహనాలతో, మనుషులతో సహా అక్కడి నుంచి పారిపోయారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హసీనా సుల్తానా మాట్లాడుతూ, సర్వే నెం. 3లో అక్రమ గరుసు తవ్వకాలను నిలిపేశామని, దీంతోపాటు తవ్వకాలకు కారణమైన వారిని పిలిపించి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎర్రమట్టి (గరుసు) కావాల్సిన వారు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని, లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేసి కారకులపై కేసులు నమోదు చేస్తామని అన్నారు.



కొండల్లో కనిపించని వాహనాలు

కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతం

- కోలుకోవడంతో రోగి డిశ్చార్జ్
- అభినందించిన హాస్పిటల్ సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 7: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 26 ఏళ్ల ఓ రోగికి నిర్వహించిన కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతమైంది. 2019లో డోన్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి కర్నూలు జీజీహెచ్‌లో మొట్టమొదటిసారిగా కిడ్నీ మార్పిడి చేశారు. నాలుగేళ్ల తర్వాత మళ్లీ సి. బెళగల్‌కు చెందిన 26 ఏళ్ల వీరన్నకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను నెఫ్రాలజీ, యురాలజీ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. వీరన్న తల్లి కిడ్నీ ఇవ్వడానికి అంగీకరించడం, ఇద్దరిది ఒకే గ్రూపు రక్తం కావడంతో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ సాధ్యపడింది. ఆరు సంవత్సరాలుగా వీరన్న కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. గత 6 నెలలుగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. క్రియాటిన్ ఎక్కువగా ఉండటం తప్పనిసరిగ్గా వైద్యులు కిడ్నీ మార్పిడి చేయాలని సూచించారు. దీంతో రోగి జనవరి 26న నెఫ్రాలజీ వార్డులో అడ్మిషన్ పొందారు. వైద్యులు అన్ని పరీక్షలు పూర్తి చేసి జనవరి 29న నెఫ్రాలజీ విభాగపు హెచ్‌వోడీ డా. ఆనంత్, యురాలజీ విభాగపు హెచ్‌వోడీ డా. సీతారామయ్య, నెఫ్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.పక్కిరెడ్డి, డా.శ్రీధర్ శర్మ నేతృత్వంలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఆపరేషన్ అనంతరం కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ వార్డు (ఐసీయూ)లో ఉంచి రోగికి చికిత్స అందించారు. రోగి కోలుకుని ఆరోగ్యంగా ఉండటంతో బుధవారం వార్డు నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు బయట రూ.6 నుంచి 8 లక్షలు ఖర్చు అవుతుందని, అయితే రోగికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా నిర్వహించామన్నారు. రెండో కిడ్నీ మరో ఆపరేషన్ చేసిన యురాలజీ, నెఫ్రాలజీ వైద్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటరంగారెడ్డి అభినందించారు.



కిడ్నీ మార్పిడి చేసుకున్న రోగితో నెఫ్రాలజి వైద్యులు

వాము ధర పైపైకి

చేతివాటం చూపుతున్న వ్యాపారులు



కర్నూలు యార్డులో విక్రయానికి తెచ్చిన వాము

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 7: కర్నూలు మార్కెట్ యార్డుకు విక్రయానికి తెచ్చిన వాము రైతుల పంట పండింది. కేవలం ఒక్క రోజు వ్యవధిలో రూ.1000 అదనంగా పెరిగింది. బుధవారం కర్నూలు నగరంలోని మార్కెట్ యార్డులో ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి రైతులు 1153 క్వింటాళ్ల వామును విక్రయానికి తెచ్చారు. గరిష్ఠంగా రూ.23,699, మధ్యస్థ ధర రూ.16,099, కనిష్ఠ ధర రూ.2,002 చేరడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ఇదే అదనుగా వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. రైతులు తెచ్చిన వామును తూకం వేసిన తర్వాత మిగిలే కిలోల వామును ఏదో ఒక రేటుకు నిర్ణయించి ఆ మొత్తాన్ని రైతుల చేతిలో పెడుతున్నారు. దీని వల్ల రైతులు బాగా నష్టపోతున్నారు. ఈ వ్యవహారంపై మార్కెట్ కమిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అదే విధంగా కందుల ధర కూడా కర్నూలు మార్కెట్ యార్డులో భారీగా పలుకుతోంది. గరిష్ఠంగా రూ.10,403, మధ్యస్థ ధర రూ.10,249, కనిష్ఠ ధర రూ.599 నిర్ణయించారు. శనగలకు క్వింటంపై గరిష్ఠ ధర రూ.6,139, మధ్యస్థ ధర రూ.6,129, కనిష్ఠ ధర రూ.1,010 రైతులకు దక్కింది. ఉల్లిగడ్డలకు కూడా గత నెలతో పోలిస్తే.. ధర పెరుగుతూ వస్తోంది. క్వింటం ఉల్లి ధర గరిష్ఠంగా రూ.1,531, మధ్యస్థ ధర రూ.1,319, కనిష్ఠ ధర రూ.655లకు చేరింది. ఎండుమిరప కాయలకు ధర క్రమంగా పెరుగుతోంది. గరిష్ఠ ధర రూ.22,009, మధ్యస్థ ధర రూ.14,599, కనిష్ఠ ధర రూ.899లకు చేరడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ కాయల ధర మాత్రం గరిష్ఠంగా రూ.7,213, మధ్యస్థం రూ.5,091, కనిష్ఠ ధర రూ.2,812 రైతులకు లభించింది.

టీడీపీలోకి బైరెడ్డి సిద్దార్థ ముఖ్య అనుచరుడు?

ఐదు వేల మందితో చేరికకు సన్నాహాలు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 7: ఓ స్థాయి నాయకులు, అధికారుల సేవలను వాడుకుని వదిలేయడం వైసీపీకి మొదట్నుంచీ ఉన్న అలవాటే. 'ఏరు దాటే వరకు ఓడ మల్లన్న ఏరు దాటాక బోడి మల్లన్న' అన్నట్లుగా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. టీడీపీతో పాటు చంద్రబాబును పదే పదే తిట్టిపోయాలని యువతను రెచ్చగొట్టి, తిరిగి వారికి మొండి చేయి చూపుతోంది వైసీపీ. ఈ క్రమంలో అలా ఆ పార్టీలో విసిగి వేసారిన కొందరు టీడీపీ వైపు చూస్తున్నారు. తాజాగా శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కీలక అనుచరుడు, విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ ఛైర్మన్ శ్రీరాములు వైసీపీకి గుడ్‌బై చెప్పనున్నారు. ఐదువేల మందితో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరేందుకు ఆయన రంగం సిద్ధం చేసుకున్నారు. విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఆయన టీడీపీలోకి చేరబోతున్నారు. విద్యార్థులకు జగన్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని, వైసీపీ మద్దతు ఇస్తే రాబోయే రోజుల్లో విద్యార్థులు తీవ్ర అన్యాయం చేసిన వారమవుతామని, విద్యావ్యవస్థను కాపాడుకోవాలని ఆయన భావిస్తున్నారు. గతంలో జగన్ ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నో ఉద్యమాలు చేశారు. 3 రాజధానులకు మద్దతుగా రాయలసీమ జిల్లాల్లో వాదనను బలంగా వినిపించేందుకు చేపట్టిన ఉద్యమానికి కీలక నాయకుడిగా పని చేశారు. ఇదిలా ఉండగా శ్రీరాములు టీడీపీలో చేరబోతున్నారని తెలిసిన శ్రీరాములుపై పాత కేసులు తిరగతోడాలని వైసీపీకి చెందిన పార్టీ పెద్దలు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.



మంత్రి రోజా, బైరెడ్డి సిద్ధార్థతో శ్రీరాములు (ఫైల్)

మహానందిలో ప్రదోషకాల పూజలు

మహానంది,ఫిబ్రవరి 7: మహానంది క్షేత్రంలో బహుళ త్రయోదశి పురస్కరించుకొని బుధవారం సాయంత్రం ఘనంగా నందీశ్వరునికి ప్రదోషకాల పూజలను ఆలయ వేదపండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సుగంధ ద్రవ్యాలతో వేదపండితులు రవిశంకర్ అవధాని, శివాలయం అర్చకులు కొమ్మద్ది శంకరయ్యశర్మ ఆలయం ప్రాంగణంలోని రాతి నందీశ్వరుని విగ్రహానికి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధుతో పాటు సిబ్బంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

13 నుంచి ఏపీ ఎన్జీవోస్ ఉద్యమ బాట



ఐక్యత చాటుతున్న నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల పెన్షనర్ల పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 13 నుంచి దశలవారిగా ఉద్యమానికి ఏపీ ఎన్జీవోస్‌లు పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర, జిల్లా ఏపీ ఎన్జీవోస్ సంఘాల ఆదేశాల మేరకు నగర అధ్యక్షుడు ఎంపీ కాశన్న అధ్యక్షతన వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 100 నెలల డీఏ బకాయిలు, 11 పీఆర్సీ బకాయిలు, జీపీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాలు, సరెండర్ లీవులు మూడు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉద్యోగులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సాయిరాం, హేమలత, స్వరూప్, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, వరలక్ష్మి, హరికృష్ణ, శంకర్, కిషోర్ పాల్గొన్నారు.

కారు దూసుకొచ్చి తల్లీ కూతుళ్ల మృతి

హనుమాపురంలో విషాదం



అక్షర(ఫైల్)



జయలక్ష్మి (ఫైల్)

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 7: పెద్దకడుబూరు మండలంలోని హనుమాపురం గ్రామంలో తల్లీ కూతుళ్లపైకి మృత్యువు కారు రూపంలో దూసుకొచ్చింది.. ఈ ప్రమాదంలో వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. హనుమాపురం గ్రామానికి చెందిన జయలక్ష్మి(37), ఆమె మరిది కుమార్తె అక్షర(6) ఆదోని- ఎమ్మిగనూరు హైవేపై పొలానికి వెళ్తున్నారు. ఆదోని నుంచి ఎమ్మిగనూరు వైపు వస్తున్న కారు డ్రైవర్ వేగాన్ని నియంత్రించలేకపోవడంతో.. రోడ్డు చివరలో పొలానికి వెళ్తున్న జయలక్ష్మి, అక్షరలపైకి దూసుకెళ్లింది. ఆ ఇద్దరినీ కారు ఫర్లాంగు దూరం ఈడ్చుకెళ్లడంతో అక్కడికక్కడే వారు మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ శ్రీనివాసులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు పెద్దకడుబూరు పోలీసులకు సమాచారం అందజేశారు. 108 అంబులెన్స్‌లో మృతులను ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు జయలక్ష్మికి భర్త దస్తగిరి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సంఘటనపై పెద్దకడుబూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామంలో విషాదం

ఈ ఘటనతో హనుమాపురం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన విషయం తెలియగానే కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతులను చూసి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అప్పటి వరకు తమ కళ్ల ముందు ఆడుకుంటూ పొలానికి వెళ్తానని మారం చేసిన పాప పది నిమిషాలకే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు

వ్యక్తిపై కత్తితో దాడి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 7: ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీలోని వివేకానంద గ్రంథాలయం ముందు భాగంలో రోడ్డుపై వ్యక్తిని కత్తితో పొడిచిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టణ వాసులు, పోలీసుల వివరాల మేరకు.. వెంకటాపురం కాలనీకి చెందిన గుజ్జుల సోమేష్‌పై వెంకటాపురానికి చెందిన రామాంజనేయులు, కుక్కల సోమేష్, మల్లెపూల వెంకటేష్, కురువ అయ్యన్న, కొండయ్య అలియాస్ రంగయ్య, గోవిందు కలిసి కత్తితో దాడి చేశారని పోలీసులు తెలిపారు. గుజ్జుల సోమేష్ కొంతకాలం నుంచి వెంకటాపురం కాలనీకి చెందిన రామాంజనేయులు ఇంటి అమ్మాయిని వేధిస్తున్నాడని మూడు నెలల క్రితం పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీన్ని మనసులో పెట్టుకున్న రామాంజనేయులు బుధవారం సోమేష్ ఒంటరిగా కనిపించడంతో దాడి చేసినట్లు బాధితుడి భార్య కేశమ్మ ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాత్రికి రాత్రే రిజిస్ట్రేషన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నందవరం, ఫిబ్రవరి 7: మండలంలోని హాలహర్వి గ్రామంలో జగనన్న స్థలాల కబ్జా అనే వార్త ఆంధ్రజ్యోతి మెయిన్‌లో ప్రచురితం కావడంతో రాత్రికి రాత్రి పట్టాలపై సచివాలయంలో అధికారులు రిజిస్ట్రేషన్ చేయించారు. సర్వే నెంబర్ 407లో 117 మందికి ఒకటిన్నర సెంటు ప్రకారం ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం జగనన్న ఇంటి స్థలాలను కేటాయించింది. పట్టాలు ఇచ్చి జియోట్యాపింగ్ కూడా చేశారు. అయితే కొంత మంది వైసీపీ నాయకుల అనుచరులు ఆ స్థలాన్ని కబ్జా చేసి కొట్టాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పట్టాదారులు అధికారుల చుట్టూ తిరిగారు. అయితే ఎవ్వరూ పట్టించు కోలేదని గత 3 రోజుల క్రితం సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మను కలిశారు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో అధికారులు మంగళవారం రాత్రి దాదాపు 20 మంది పట్టాదారులకు సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. మిగతా వారికి 10 తేదిలోపు రిజిస్ట్రేషన్ చేయిస్తామని అన్నారు.

రిజిస్ట్రేషన్లు చేయించి హద్దులు చూపాలంటూ ధర్నా

జగనన్న పట్టాలు ఇచ్చిన నాయకులు, అధికారులు తమకు రిజిస్ట్రేషన్ చేయించి, హద్దులు చూపాలని హాలహర్వి గ్రామానికి చెందిన పట్టాలు పొందిన మహిళలు నందవరం తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఓబులేసుకు తమ గోడును విన్నవించుకున్నారు.

అందరికీ రిజిస్ట్రేషన్ చేయిస్తాం

పట్టా లబ్ధిదారులు వచ్చి అర్జీలు ఇచ్చారు. పట్టాలున్న ప్రతి ఒక్కరికీ రిజిస్ట్రేషన్ చేయిస్తాం. ఆర్డీవోతో మాట్లాడి అందరికీ న్యాయం చేస్తాం.

-ఓబులేసు తహసీల్దార్

రేషన్ పంపిణీని పకడ్బందీగా నిర్వహించండి



కార్డుదారులతో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఎండీయూ వాహన ఆపరేటర్లను, వలంటీర్లను ఆదేశించారు. బుధవారం నగరంలోని గణేష్‌నగర్ హౌసింగ్ బోర్డు కాలనీలో జరుగుతున్న రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. నిత్యావసర సరుకుల పంపిణీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కార్డుదారులను అడిగి తెలుసు కున్నారు. రేషన్‌తోపాటు పోషక విలువలు కలిగిన రాగులను కూడా వినియోగించుకోవాలని కార్డుదారులను సూచించారు. ప్రభుత్వం ఇస్తున్న రేషన్ సరుకులు ఎండీయూ వాహనం ద్వారా మీ ఇంటి వద్దకే అందజేస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కేవీ ఎస్ఎం ప్రసాద్, అర్బన్ ఏఎస్‌వో రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజస్వామి సంకీర్తనలు



త్యాగరాజ స్వామి సంకీర్తనలు ఆలపిస్తున్న సంగీత కళాశాల అధ్యాపకులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 7: నగరంలో ఆర్డీవో కార్యాలయం కాంపౌండులోగల ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలలో బుధవారం సాయంత్రం నిర్వహించిన త్యాగరాజస్వామి సంకీర్తనల ఆలాపన కార్యక్రమం ఆసాంతం శ్రోతలను అలరింపజేసింది. సద్గురు త్యాగరాజ స్వామి 177వ ఆరాధనోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా విశ్రాంత సంగీత అధ్యాపకురాలు సి.సరస్వతి హాజరై త్యాగరాజ స్వామి వారికి పంచరత్న సేవ నిర్వహించారు. త్యాగరాజ స్వామి చిత్రపటానికి, సీతారామచంద్ర లక్ష్మణ విగ్రహ మూర్తులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె త్యాగరాజస్వామి శ్రీరామచంద్ర మూర్తిపై రాసి, పాడిన సంకీర్తనలు, కృతులకు అర్థాలు, ఆయా కీర్తనల్లోని విశేషాలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

15న అనుగొండలో తిరుణాల

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 7: మండలంలోని అనుగొండ గ్రామంలో ఈనెల 15న అవధూత రామిరెడ్డి తాత తిరుణాల ఉత్సవం జరుగనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఇందులో భాగంగా ఆలయంలో పంచామృతాభిషేకం, తాతార్యుల నామజపం, హారతి, గ్రామోత్సవం, భజనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరుణాలను పురస్కరించుకొని ఈనెల 16న పాలపళ్ల ఎద్దుల బండలాగు పోటీలు జరుగుతాయన్నారు. మొదటి బహుమతి రూ.30వేలు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, రెండో బహుమతి రూ.22వేలు కోట్ల హరిచక్ర పాణిరెడ్డి, మూడో బహుమతి రూ.17వేలు హరికిరణ్, సుబ్రమణ్యం, నాలుగో బహుమతి రూ.12వేలు ఎర్రలింగన్న, ఐదో బహుమతి రూ.9వేలు చిన్నఅయ్యన్న తర్వాత స్థానాల్లో విజేతలకు రూ.6వే లు, రూ.5వేలు, రూ 4వేలను వరుసగా డ్రైవర్ ఎల్లప్ప, మాధవశంకర్, చిన్న రాముడు అందిస్తారని వివరించారు.

చలో అసెంబ్లీ విజయవంతం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 7: సర్పంచ్‌ల చలో అసెంబ్లీ విజయవంతమైందని ఏపీ పంచాయితీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన వేలాది మంది పోలీసులను దాటుకుని అసెంబ్లీకి చేరుకున్నామని అన్నారు. రాబోయే కాలంలో సంఘం అధ్యక్షుడు వైవీ.బి. రాజేంద్రప్రసాద్ నాయకత్వంతో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని అన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 7: ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అంజిబాబు అన్నారు. బుధవారం కార్మిక కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2020-2021 సంవత్సరంలో జరిగిన రైతు ఉద్యమ సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను నరేంద్ర మోదీ అమలు చేయలేదన్నారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు నాగేశ్వర రావు, ఈరన్న, ప్రభాకర్, నారాయణస్వామి పాల్గొన్నారు.

● దేశవ్యాప్తంగా ఈ నెల 16న జరిగే రవాణారంగ సమ్మెను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కే.ప్రభాకర్ పిలుపునిచ్చారు. నగర శివారులోని కార్బైట్ ఫ్యాక్టరీ ఆవరణలో లాంగ్‌లారీ ఓనర్ అసోసియేషన్ కార్యాలయంలో మోటార్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కే.ప్రభాకర్ మాట్లాడుతూ డ్రైవర్లను కఠినంగా శిక్షించి జైలుకు పంపే బీఎన్ఎస్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చట్టం అమలు చేస్తే డ్రైవర్లు రోడ్లపై కాకుండా జైల్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుందన్నారు. ఈ సమావేశంలో పాచరేలే మిన్నల్లా, గంగాధర్, జి.శ్రీనివాసులు, మాబాషా, శ్రీనాథ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 7: కర్నూలు నియోజకవర్గ అభివృద్ధిపై కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. వైఎస్ఆర్ హయాంలో మంజూరైన జొహరాపురం ఇందిరమ్మ ఇళ్లపట్టాలు సాంకేతిక కారణాలతో కోర్టులో పెండింగ్‌లో ఉందని, సత్వర న్యాయం చేయా లని గృహనిర్మాణ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఐటి రంగాలలో అభివృద్ధి చెందిన హైదరాబాద్-బెంగళూరు ప్రాంతాల తరహాలో కర్నూలుని సైతం ఐటి హబ్‌గా తీర్చిదిద్దేలా చూడాలని ఐటీ శాఖ మంత్రిని కోరారు.

అవయవదాత పావనీలత అంతిమయాత్ర

పాల్గొన్న కుటుంబ సభ్యులు జేవీవీ, స్వచ్ఛంద సంస్థలు

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 7: అవయవదాత పావనీలత అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు, స్వచ్ఛందసంస్థలు, పార్టీ నేతలు, జనవిజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం నగరంలోని బాలాజీనగర్‌లోని పావనిలత ఇంటి వద్దకు వచ్చిన పార్థీవదేహానికి అందరూ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జన విజ్ఞాన వేదిక, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, మహిళా సంఘం నాయకులు, కళాకారులు దారి పొడుగునా పాటలు పాడుతూ వీడ్కోలు పలికారు. వెంకటరమణ కాలనీలో ఉన్న కేశవరెడ్డి స్కూల్, శ్రీలక్ష్మి పాఠశాల, కేఎస్ఆర్ స్కూల్ విద్యార్థులు పావనీలత అంతిమయాత్రపై రోడ్డుకు ఇరువైపులా నిల్చుని పుష్పాలు చల్లుతూ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేష్ కుమార్, మానవతా కన్వీనర్ మనోహర్ రెడ్డి, మహిళా కమిటీ కన్వీనర్ యానిప్రతాప్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ విజయ కుమార్ రెడ్డి,



పావనీలతకు కొవ్వొత్తులతో నివాళి



అంతిమయాత్రలో పాల్గొన్న కుటుంబ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు

ఆవోపా నాయకులు యుగంధర్, ప్రసాద్‌గౌడు, జేవీవీ అనంతపురం జిల్లా కళాకారులు పాల్గొన్నారు.

పావనీలతకు కొవ్వొత్తులతో నివాళి: అవయవదాత పావనీలతకు స్వచ్ఛంద సంస్థలు జేవీవీ మనావతా, రెడ్‌క్రాస్ సంస్థ, వివిధ పార్టీలు బుధవారం రాత్రి కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కేజీ గోవిందరెడ్డి, వీహెచ్‌పీ నాయకులు డా.లక్కిరెడ్డి అమరసింహారెడ్డి, భజరంగదళ్ నాయకులు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ పావనీలతను అందరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, వైసీపీ కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, అరుణ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు సురేష్ కుమార్, మానవతా సంస్థ కన్వీ నర్ మనోహర్ రెడ్డి, మహిళా విభాగం నాయకులు యాని ప్రతాప్, దీప, అపర్ణ సుభద్ర, న్యాయవాది హేమలత, అపోవా నాయకులు యుగంధర్, రెడ్‌క్రాస్ సొసైటీ గార్గేయపురం శ్రీనివాసులు, రమేష్, హెడ్ మాస్టర్ల అసోసి యేషన్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలి

గూడూరు, ఫిబ్రవరి 7: జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో బి.రామగిడ్డయ్య, ఎంపీడీవో జయశ్రీ అన్నారు. బుధవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో 9న జరిగే జాతీయ నులిపురుగుల దినాన్ని పురస్కరించుకుని డీఎంహెచ్‌వో, ఎంపీ డీవోలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అలాగే పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మం డల విద్యాశాఖ అధికారులు సునీలమ్మ, నాగరాజు, ఏవో విజయసింహారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కోడుమూరు: ఈ నెల 9న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలని ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అపరిశుభ్రత కారణంగా నులిపురుగులు ఏర్పడతాయని, వీటి నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను తీసుకో వాలని అన్నారు. ఈనెల 9న అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు



కోడుమూరులో పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు



గూడూరులో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో

ఆల్బెండజోల్ మాత్రలు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనంత రం పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో దివ్య, ఎంఈవో వసంత లక్ష్మీ, శరభయ్య, వైద్య అధికారులు శాంత, భాస్కర్‌రావు, మదన్‌శేఖర్ ఎంపీహెచ్‌వో నరసప్ప వైద్య, ఐడీఎస్ సూపర్‌వైజర్లు మాధవి, రాధ, శారద, ఉమాభాయ్ పాల్గొన్నారు.

సి.బెళగల్: జాతీయ నులిపురుగుల దినాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శకుంతల, మండల విద్యాధికారి జ్యోతి ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ప్రధానోపాధ్యాయులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిశోర్, సుజాత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మావతమ్మ, మల్లేశ్వరి, ఈవోఆర్డీ సందీప్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 7: నగరంలోని 22వ వార్డు బీ.క్యాంపుకు చెందిన పలు కుటుంబాలు టీడీపీ నాయకుడు బాలరాజు ఆధ్వర్యంలో పార్టీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ సమక్షంలో బుధవారం పార్టీలో చేరారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ప్రజల భవిష్యత్తు బాగుంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రూ.5వేలు ఇచ్చి వలంటీర్లుగా తీసుకొని యువత ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేశారన్నారు. పార్టీలో చేరిన వారిలో పెద్ద పుల్లయ్య, చిన్న పుల్లయ్య, వీరయ్య, నగేష్, ఓబు లేసు, అంజీ, రాము, హరి, నాగరాజు, ఓబులమ్మ, కవిత, సావిత్రి, లలిత, మధు, దుర్గాదేవి, సుబ్బలక్ష్మమ్మ, శివ ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగారెడ్డి, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, భరత్, మధు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో టీజీ భరత్ ముఖాముఖి: నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో ఉన్న అశోక్ స్టడీ సర్కిల్‌లో బుధవారం నిరుద్యోగులతో టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయంలో రెండు సార్లు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఈ ఐదేళ్లుగా నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులు ఎదురు చూసినా ఫలితం దక్కలేదన్నారు. తమ ప్రభుత్వం వస్తే 20 లక్షల ఉద్యోగాలు రాష్ట్రంలో వస్తాయన్నారు. కార్యక్రమంలో స్టడీ సెంటర్ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరించిన టీజీ భరత్

కర్నూలు(కల్చరల్): వర్కింగ్ జర్నలిస్టులకు అండగా ఉంటానని టీడీపీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని మౌర్య ఇన్‌లోని ఆయన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ముద్రించిన నూతన సంవత్సర డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్‌వీ సుబ్బయ్య, గౌరవ సలహాదారుడు వైవీ కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈఎన్ రాజు, కే శ్రీనివాసగౌడ్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజి, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, జిల్లా సహాయ కార్యదర్శులు శివరాజ్‌కుమార్, అవినాష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ

కోడుమూరు, ఫిబ్రవరి 7: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఎలక్ట్రీషియన్, వాటర్ వర్క్ సిబ్బందికి రెండు జత దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక పంచాయతీ బోర్డులో బుధవారం సర్పంచు భాగ్యరత్న చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ పట్టణంలో దోమల నివారణ కోసం హైపో ద్రావణం పిచికారి చేశామన్నారు. పంచాయతీ కార్యదర్శి అజయ్‌భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ సురేష్, లక్ష్మీ పంచాయతీ సిబ్బంది చంద్రశేఖర్, నాగరాజు, శ్రీనివాసులు, వీరన్న పాల్గొన్నారు.

కొత్త ఓటర్లకు అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న గోవిందరెడ్డి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 7: సార్వత్రిక ఎన్నికల్లో మొదటి ఓటును చంద్రబాబు నాయుడుకు ఓటు వేసేలా కొత్త ఓటర్లకు అవగాహన కల్పించాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి సూచిం చారు. బుధవారం ఓర్వకల్లులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన సంక్షేమ పథకాలు, మండలంలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు, గ్రామాభివృద్ధిపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. అధికారంలోకి వచ్చాక టీడీపీ ప్రభుత్వం చేపట్టే ఆరు పథకాలను వివరించా లన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, నాగరాజు, అబ్దుల్లా, యాసిన్‌బాషా, అయూబ్‌బాషా పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి: సీపీఎం

కర్నూలు(న్యూసిటీ)/(కల్లూరు), ఫిబ్రవరి 7: నగరంలోని 39వ వార్డు పరిధిలోని బాలాజీనగర్‌లో కాలువ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం బృందం బాలాజీనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ నెలరోజుల క్రితం బాలాజీనగర్‌లో కాలువల నిర్మాణం కోసం పెద్ద కల్వర్టును తవ్వారని అన్నారు. తవ్వి అలాగే వదిలేయడతో కల్వర్టులో మురు గునీరు చేసి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.యేసు, సుబ్బారెడ్డి, హనుమన్న, మారెన్న, నాగేంద్ర పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

సి.బెళగల్, ఫిబ్రవరి 7: పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో శకుంతల అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ పంచాయతీలో అందుబాటులో లేని కార్యదర్శులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈవోఆర్డీ సందీప్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై శిక్షణ

గూడూరు, ఫిబ్రవరి 7: ఉపాధి హామీ పథకానికి సంబంధించి మహిళా మేట్లకు శిక్షణా కార్యక్రమం బుధవారం గూడూరు మండల పరిషత్ కార్యాల యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, ఏపీడీ అల్లిపీరా, సీడీసీఎల్ఆర్‌సీ సుజాత, శానిటేషన్ సూపర్‌వైజర్ రత్నం, ఈసీ పెంచలయ్య, ఏపీవో రామేశ్వరమ్మ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండించండి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 7: ఆశావర్కర్ల అక్రమ అరెస్టులను ఖండిం చాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, నాయకుడు నాగేశ్వరరావు అన్నారు. నాలుగు, మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో పని చేస్తున్న ఆశావర్కర్లు చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్నారని స్టేషన్లకు తీసుకెళ్లాడం దుర్మార్గమైన చర్య అన్నారు.

ఆ భూముల్లో లేఅవుట్ సరికాదు

▸▸ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ఓర్వకల్లు, ఫిబ్రవరి 7: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ పొలిమేరలో ఎరుకలి సుబ్బమ్మ భూమిలో జగనన్న లేఅవుట్ వేయడం సరికాదని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. బుధవారం ఆమె పొలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుకలి సుబ్బమ్మ ఉయ్యాలవాడ గ్రామంలోని 797/ఏ-15 సర్వే.నెంబరులో 4 ఎకరాల ప్రభుత్వ భూమిని గత 20 సంవత్సరాలుగా సాగు చేసుకుంటుందదన్నారు. అనేక సార్లు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని విన్నవిం చుకున్న అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇటీవల గ్రామానికి 2 కిమీల దూరం ఉన్న ఎరుకలి సుబ్బమ్మ పొలంలో జగనన్న లేఅవుట్లు వేయడం దుర్మార్గమన్నారు. ఆ భూమిపై ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన స్టే ఆర్డర్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగన్న, మధుసూదన్, మాసూ ంబాషా పాల్గొన్నారు.



ఎరుకలి సుబ్బమ్మ భూమిని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

క్రీడాకారులకు న్యాయం చేయండి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 7: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన క్రీడల్లో తమకు అన్యాయం జరిగిందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఖోఖో, కబడ్డీ క్రీడల్లో జొహరాపురం గ్రామ వాసులకు అన్యాయం జరిగిందని బుధవారం అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ వద్ద మొరపెట్టుకున్నారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్రీడలలో జొహరాపురం జట్టు ఖోఖోలో విన్నర్‌గా, కబడ్డీలో రన్నర్‌గా గెలుపొందారన్నారు. విన్నర్‌గా రావాల్సిన రూ.35 వేలు, రన్నరగా రావాల్సిన రూ.15 వేలు ఇవ్వకుండా మోసం చేశారని ఆయనకు ఫిర్యాదు చేశారు. ఇదంతా మున్సిపల్ కార్యాయలంలో విధులు నిర్వహిస్తున్న మహ్మద్ అలీ పథకం ప్రకారమే తమ జట్టుకు అన్యాయం చేశారని అడిషనల్ కమిషనర్ ముందే వాగ్వాదానికి దిగారు. గెలుపొందిన జట్టు నుంచి జిల్లా స్థాయికి సభ్యులను ఎంపిక చేస్తారని చెప్పి తమ జట్టులోని సభ్యులను ఎవ్వరని ఎంపిక చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు ఎం.క్రిష్ణ, కరుణాకర్, ఎస్.సురేష్, జి.వంశీ, ఎం.మధు, సయ్యద్, రాజేష్ పాల్గొన్నారు.

కోడుమూరులో నాకాబంది



రౌడీ షీటర్ల ఇళ్లల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

కోడుమూరు, ఫిబ్రవరి 7: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలో సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్ఐ బాల నరసింహులు, పీరయ్య, తిమ్మారెడ్డి నాకా బంది నిర్వహించారు. పట్టణంలోని రౌడీ షీటర్ల ఇండ్లలో సోదాలు చేపట్టారు. ఎన్నికల సమయంలో ఎవరైన అల్లర్లు, దాడులకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తా మని సీఐ హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

కల్లూరు, ఫిబ్రవరి 7: మండలంలోని పర్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.15లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచు పి.హనుమక్క తెలిపారు. బుధవారం ఎస్సీకాలనీలో 280 మీటర్ల మేర గడప గడపకు నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించామని, గ్రామంలోని లొడ్డమారెన్న ఇంటి నుంచి నరసింహులు ఇంటి వరకు రోడ్డు పనులు నిర్వహించామని ఆమె తెలి పారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు పి.శేఖర్, నరసింహులు, రాముడు, సుంకన్న, కోడెల రవి, నాగరాజు, నరసన్న తదితరులు పాల్గొన్నారు.



పర్ల ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

జిల్లా జూనియర్ మహిళల హాకీ జట్టు ఎంపిక



జూనియర్ మహిళల కర్నూలు హాకీ జట్టుతో దాసరి సుధీర్

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 7: హాకీ ఆంధ్రప్రదేశ్ నిర్వహించే 13వ ఏపీ జూనియర్ మహిళల అంతర్ జిల్లా హాకీ పోటీల్లో పాల్గొనే కర్నూలు జిల్లా జట్టును హాకీ కర్నూలు కార్యదర్శి దాసరి సుధీర్ ప్రకటించారు. ఈ నెల 9 నుంచి 11 వరకు శ్రీకాకుళంలో జరిగే అంతర్ జిల్లా పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు పాల్గొంటుందని తెలిపారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు పతకాలతో రావాలని కోరారు. హాకీ కర్నూలు జిల్లా వైస్ ప్రెసిడెంట్ డా.ప్రవీణ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీలిషికారీలను ఆదుకోవాలి: బీజేపీ



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, బంగారుపేట వాసులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 7: నగరంలోని బంగారుపేట నీలిషికారీలకు ఇళ్లస్థలాలు ఇప్పించి ఆదుకోవాలని బీజేపీ కార్యవర్గసభ్యుడు నగరూరు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం బంగారుపేట వాసులతో కలిసి బీజేపీ అధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ బంగారుపేటలో రోడ్డు వెడల్పులో భాగంగా నాలుగేళ్ల క్రితం అధికారులు ఇళ్లను కూల్చివేశారని, దీంతో నీలిషికారీలు రోడ్డున పడ్డారని అన్నారు. అనంతరం అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీనాయుడు, మైనార్టీ నాయకుడు పీఎస్.వి.ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదవ్, అధికార ప్రతినిధి రామాం జనేయులు, మహేష్‌నాయుడు, నాగరాజు, బంగారుపేట వాసులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించొద్దు: ఎస్ఐ



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్ఐ తిమ్మారెడ్డి

సి.బెళగల్, ఫిబ్రవరి 7: ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించొద్దని ఎస్ఐ తిమ్మారెడ్డి పోలీసులకు సూచించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను తెలిపేందుకు స్టేషన్‌కు వస్తే పోలీసులు వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అయా గ్రామ పంచా యతీల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేశామ న్నారు. ఈసమావేశంలో ఏఎస్ఐ నాగన్న, హెడ్ కానిస్టేబుల్, పోలీసులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ టెస్టు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 7: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఏ.క్యాంపు ఇందిరాగాంధీ మెమోరియల్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్టు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు పరీక్షల నుంచి ఒత్తిడి లేకుండా చేయాలని ప్రజ్ఞ వికాస పరీక్ష నిర్వహించామని ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు మల్లేష్ సహాయ కార్యదర్శి ఆర్యన్ తెలిపారు. ఈ మోడల్ టెస్టు నిర్వహించడం వలన విద్యార్థుల్లో భయాందోళనలు తొలగిపోతా యన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీమఠం ఉద్యోగులకు తగిన వేతనం ఇవ్వాలి

మంత్రాలయం, ఫిబ్రవరి 7: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో పని చేస్తున్న స్వీపర్లకు, ఉద్యోగులకు నిబంధనల ప్రకారం వేతనం ఇవ్వాలని సీపీఐ జిల్లా నాయకులు భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ శ్రీధర్‌మూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్వీపర్లకు తక్కువ జీతాలు ఇస్తూ వెట్టిచాకిరి పనులు చేయించుకుంటున్నారని ఆరోపించారు. రూ.20 కోట్ల ఆదాయం ఉన్న మఠంలో దేవదాయ శాఖ, ప్రభుత్వం ప్రకారం పనులకు తగిన వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్ నాయక్, శ్రీమఠం సూపరింటెండెంట్ అనంత పురాణిక్ పాల్గొన్నారు.

విధులకు హాజరు కాకపోతే జీతాలు నిలిపివేస్తాం

మంత్రాలయం, ఫిబ్రవరి 7: మండలంలో సచివాలయ ఉద్యోగులు సరైన సమయానికి విధులకు హాజరు కాకపోతే జీతాలు నిలిపివేస్తామని ఎంపీడీవో మునెప్ప హెచ్చరించారు. బుధవారం మండలంలోని మాధవరం సచివాలయం-1, 2ల ఉద్యోగుల హాజరు తక్కువ ఉండటంతో రికార్డులను పరిశీలించి హాజరు పట్టికను పరిశీలించి.. మిగతా ఉద్యోగులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఉదయం 11 గంటలైనా ఉద్యోగులు హాజరు కాకపోవడంపై మండిపడ్డారు. విధులకు హాజరు కాకపోవడం ప్రతి బుధవారం సచివాలయంలో సమావేశం జరుపుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

మంత్రాలయం, ఫిబ్రవరి 7: మంత్రాలయం మండలంలో నదితీర గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం నదితీర గ్రామాల్లో పర్యటించి మాధవరంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఉండటంతో ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో కార్యదర్శి వేణుగోపాల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్ కుమార్, జేఈ భాస్కర్ రెడ్డి, రెడ్డప్ప, జంగం వీరన్నస్వామి, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు కేటాయించే వరకు నిరాహార దీక్షలు



దీక్షలో కూర్చున్న టీడీపీ ఎంపీటీసీలు నరసన్న, రహింతుల్లా, తొగలగల్లు గ్రామ సర్పంచ్ ఆంజనేయులు

ఆస్పరి, ఫిబ్రవరి 7: గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని, నిధులు కేటాయించే వరకు నిరాహారదీక్షలు చేస్తామని టీడీపీ ఎంపీటీసీలు నరసన్న, రహింతుల్లా, తొగలగల్లు గ్రామ సర్పంచి ఆంజనేయులు తెలిపారు. బుధవారం స్థానిక బస్టాండ్ వద్ద నిరాహారదీక్షను చేపట్టగా స్థానిక నాయకులు మద్దతు పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి ముత్యాల రెడ్డి, నాయకులు ఈశ్వర్, రాఘవ రెడ్డి, రంగస్వామి పాల్గొన్నారు.

తారు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

చిప్పగిరి, ఫిబ్రవరి 7: చిప్పగిరి నుండి దౌల్తాపురం, నంచర్ల, మద్దికెర మీదుగా రూ.12 కోట్లతో నిర్మిస్తున్న తారురోడ్డు నిర్మాణానికి ఆలూరు వైకాపా మండల సమన్వయకర్త విరుపాక్షి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జూటూరు మారయ్య, చిప్పగిరి దౌల్తాపురం, నంచర్ల సర్పంచులు గోవిందరాజులు పాల్గొన్నారు.

గంజహళ్లి గ్రామ సర్పంచ్ విరాళం

గోనెగండ్ల, ఫిబ్రవరి 7: గంజహళ్లి గ్రామంలో జరిగే పలు కార్యక్రమాలకు గ్రామ సర్పంచ్ రాముడు బుధవారం గంజహళ్లి గ్రామంలోని మారెమ్మ దేవాలయానికి రూ.లక్ష, చర్చి నిర్మాణ పనులకు రూ. 50వేలు విరాళం అందజేశారు. అంతముందు గ్రామంలో, దేవాలయాల దగ్గర గరుసు తోలేందుకు, బండలు పరిచేందుకు, ఎద్దుల పందెలు ఏర్పాటు చేసేందుకు గాను రూ.5.50 లక్షలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ తిరుమలరెడ్డి, మహేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 7: పోలీసు అధికారులు దళితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్ డిమాండ్ చేశారు. బుధవారం గోనెగండ్లకు కొత్తగా వచ్చిన సీఐ మల్లికార్జునయ్యను రామతీర్థం అమ్రేష్, సంఘం నాయకులు కలిశారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

పత్తికొండ, ఫిబ్రవరి 7: స్థల వివాదంలోని పాత విభేదాలతో ఓ యువకుడిపై మరో వ్యక్తి దాడి చేశారు. పత్తికొండ పాతపేటకు చెందిన మనోహర్‌కు, శాబ్దిన్ నూర్‌బాషాకు ఓ స్థలానికి సంబంధించిన గొడవలు ఉన్నాయి. దీనికి సంబంధించి గతంలో వీరిపై కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మనోహర్ ఆదోని రహదారిలో సిద్ధం పెట్రోల్ బంకు వద్ద ఓ దుకాణం వద్ద ఉండగా.. నూర్‌బాషా తనపై దాడి చేశారని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు సీఐ మురళి మోహన్ తెలిపారు. ఈ మేరకు శాబ్దిన్ నూర్‌బాషాపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఆయన తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : బీవీ

గోనెగండ్ల, ఫిబ్రవరి 7: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని హెచ్ కైరవాడి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం భాగంగా ఆయన పర్యటించారు. అలాగే రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి రాత్రి అక్కడే బస చేశారు. బీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన ఉన్నదా లేదా అనే విధంగా తయారైందని, మన రాష్ట్రంలో పరిశ్రమలు లేక యువత, నిరుద్యోగులు పక్క రాష్ట్రాలకు వలసలు పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ చేసే తప్పులను బయట పెట్టినా, విమర్శించినా వారిపై తప్పుడు కేసులు పెట్టడం జైల్లో వేయడం పరిపాటిగా మారిందన్నారు. తాను ప్రకటించిన నవరత్నాల కోసం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేశాడన్నారు. నిత్యవసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, ధరలు పెంచడమే గాక కరెంట్ బిల్లులు, బస్‌చార్జీలు పెంచడం దారుణం అన్నారు. 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్‌లు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, 18 ఏళ్లు దాటిని మహిళలకు నెలకు రూ. 1500, నిరుద్యోగులకు నెలకు రూ. 3000 ప్రతి గ్రామానికి తాగునీరు, రోడ్ల సమస్య లేకుండా చూస్తామని ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, జయరామ్ గౌడ్, తిమ్మారెడ్డి, రాజేష్, పెద్దయ్య, విల్సన్ రఫీక్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

● పెద్దమరివీడు గ్రామంలో మంగళవారం రాత్రి బస చేసిన అనంతరం బుధవారం ఉదయం పలు వీధుల్లో బీవీ జయనాగేశ్వరరెడ్డి పర్యటించారు. యువత, మహిళలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అధికార వైసీపీ హయాంలో నిరుద్యోగులు ఉపాధి లేక వారు పడుతున్న బాధలను బీవీ దృష్టికి తీసుకువచ్చారు. టీడీపీ అధికారంలోకి వస్తే భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ద్వార రాష్ట్రంలో నిరుద్యోగులకు ఎటువంటి ప్రయోజనం కల్పించనున్నారో బీవీ వివరించారు.

బీసీల అభివృద్ధి టీడీపీ లక్ష్యం: కేఈ శ్యాంబాబు



బీసీ సదస్సులో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 7: బడుగు బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ పని చేస్తుందని పత్తికొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం క్రిష్ణగిరిలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో 34 శాతం ఉన్న బీసీల రిజర్వేషన్‌ను 10 శాతానికి తగ్గించి బీసీలను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బీసీలపై రోజు రోజుకు వైసీపీ దౌర్జన్యాలు అధికమయ్యాయని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందిచేలా, బీసీ ఉప కులాలకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి వెచ్చించేలా ప్రత్యేక మేనిఫెస్టోను టీడీపీ రూపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఆలంకొండ నబి సాహెబ్, మాదాపురం ఎల్వీ ప్రసాద్, కటారుకొండ మర్రి శ్రీరాములు, రామాకృష్ణాపురం దామోదర్ నాయుడు, మాదాపురం గురుస్వామి, చిట్యాల సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

తుగ్గలి, ఫిబ్రవరి 7: మూడు నెలల్లో రైతన్న రాజ్యం టీడీపీ ప్రభుత్వం వస్తుందని, రైతులను నట్టేట ముంచిన వైసీపీకి బుద్ధి చెబుదామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని రామలింగాయపల్లె, కేపీ గుడిసెల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు పాల్గొని ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రజలకు అందించే పథకాలను వివరించడంతో పాటు వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసం గురించి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి, మాజీ ఎంపీపీ కొమ్మె వెంకటేష్, సర్పంచ్ రంగమ్మ, మనోహర్ చౌదరి, తిరుపాల్‌నాయుడు, ఈరమ్మ, చంద్రశేఖర్‌యాదవ్, వెంకట్రాముడు చౌదరి, మధుబాబు, సత్య, లక్ష్మీనారాయణ చౌదరి, బాలన్న, లక్ష్మణ స్వామి, రవి యాదవ్, సంగాల క్రిష్ణ, పక్కీరప్ప, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం వ్యవసాయాధికారిపై విచారణ



అధికారులతో మాట్లాడుతున్న జానయ్య

మంత్రాలయం, ఫిబ్రవరి 7: మంత్రాలయం వ్యవసాయాధికారి జీర గణేష్‌పై బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి అరుణకుమారి, ఏడీఏ మహ్మద్ ఖాద్రీలు విచారణ చేశారు. బుధవారం మంత్రాలయంలోని పశు సంవర్ధక శాఖలో ఏవోపై వచ్చిన ఫిర్యాదులను విచారించారు. జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య, జిల్లా అధ్యక్షుడు ముత్తుసుమాల, ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న విచారణ అధికారులతో తగిన ఆధారాలను చూపించారు. మంత్రాలయం మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలతో ఏవో కుమ్మక్కై నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఆంధ్ర, కర్ణాటకకు అక్రమ వ్యాపారం చేశారని ఆరోపించారు. ఏవోపై సమగ్ర విచారణ జరిపి, సస్పెండ్ చేయకపోతే జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకోలు, ధర్నాలు, నిరాహారదీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనిల్ కుమార్, మారెన్న, సురేష్, ఈరన్న, పరుశురాం, నరసింహులు, గోపాల్, గర్జి ప్రకాష్, ఆదామ్, రవికుమార్ పాల్గొన్నారు.

వైభవంగా మస్తానయ్య ఉరుసు ఉత్సవాలు

తుగ్గలి, ఫిబ్రవరి 7: మస్తానయ్య ఉరుసు ఉత్సవాల్లో భాగంగా వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. బుధవారం మండల పరిధిలోని ముక్కెళ్లలో మస్తానయ్య స్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా స్వామి వారిని గుర్రంపై నుంచి గ్రామ పురవీదుల గుండా ఊరేగింపు మేళతాళాలు, డప్పువాయిద్యాల మధ్య ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, రామచంద్ర, చంద్రన్న, చిరంజీవి, లక్ష్మణస్వామి, వెంకటేశ్వర్లు, మునిస్వామి తదితరులు ఉన్నారు.

తప్పుల తడకగా ఓటరు జాబితా

ఆస్పరి, ఫిబ్రవరి 7: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటరు జాబితాలో తప్పులు తడకల్లా ఉన్నాయని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి ముత్యాల రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నాయకులు రాఘవరెడ్డి, నాగేందర్ రెడ్డి, నాగేంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆస్పరి మండలంలోని శంకరబండ గ్రామంలో ఓటరు జాబితాలో అధిక సంఖ్యలో మృతి చెందిన, ఊరు విడిచి వెళ్లిన, పెళ్లయిపోయిన మహిళా ఓటర్లకు అధిక సంఖ్యలో అలానే ఉన్నాయని తహసీల్దార్‌కు విన్నవించారు. ఆయా గ్రామాల్లోని బీఎల్వోలు ఓటరు జాబితా సక్రమంగా చేయడం లేదని ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి, ఓటరు జాబితాలోని తప్పులను సవరించాలన్నారు.

నెలాఖరు వరకు ఆన్‌లైన్ ఓటు నమోదు

గోనెగండ్ల, ఫిబ్రవరి 7: ఈ నెల చివరి వరకు ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. బుధవారం గోనెగండ్లలోని ఎంపీడీవో సమావేశం భవనంలో బీఎల్‌వోలు, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల చివరి వరకు ఫామ్ 6, ఫామ్ 7, ఫామ్ 8లను దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కొత్త ఓటరు నమోదు, మార్పు చేర్పులు, మృతి చెందిన ఇతరత్ర తొలగించడం, తరతర అంశాలను సరిచేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శివశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్‌డీ నాగేష్ పాల్గొన్నారు.

సారా బెల్లం పట్టివేత..

మద్దికెర, జనవరి 7: మద్దికెర గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తుల నుంచి పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రూ. 2.50 లక్షలు విలువ గల 54 క్వింటాళ్ల సారా బెల్లంను బుధవారం పట్టుకున్నారు. సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, పత్తికొండ ఎక్సైజ్ సీఐ స్వర్ణలత విలేకరులతో మాట్లాడుతూ మద్దికెర గ్రామంలో గత 25 ఏళ్లుగా సారా వ్యాపారం చేస్తున్న వ్యక్తుల నుంచి తమకు పక్కా సమాచారం రావడంతో దాడులు నిర్వహించి సారా బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికలు వస్తున్నాయనే ఉద్దేశంతో చెక్‌పోస్టులు నిర్వహిస్తున్నామని, సారా నిర్వాహకులు సారా తయారీ కోసం బెల్లాన్ని నిల్వ ఉంచుకున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రమేష్‌బాబు, ఏఎస్ఐ చెన్నయ్య, శంకర్, ఫణిరాజు తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన జగన్..



పత్తికొండలో ధర్నా నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ కార్యకర్తలు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 7: నిరుద్యోగులను సీఎం జగన్ మోసం చేశారని ఏఐవైఎఫ్ నాయకులు హనుమేష్, పెద్దయ్య, కారుమంచి అన్నారు. బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ తాను అధికారంలోకి రాగానే భర్తీ చేస్తామని చెప్పిన జగన్ రెడ్డి ఐదేళ్ల కాలంలో ఏ ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేసిన దాఖాలాలు లేవన్నారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిరుద్యోగుల ఓట్లను రాబట్టుకునేందుకు ఆఘమేఘాల మీద 6,100 పోస్టులకు మెగా డీఎస్సీ ప్రకటిస్తున్నామని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. నిరుద్యోగులను మోసం చేయాలని చూస్తే.. తెలంగాణలో కేసీఆర్‌కు పట్టిన గతే ఏపీలోనూ జగన్ రెడ్డికి అదే గతి పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు చిరంజీవి, ఆల్తాఫ్, సురేంద్ర, నాగరాజు, సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు మోసం

కౌతాళం, ఫిబ్రవరి 7: నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని టీడీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్పగౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగంలో ఏపీని 24వ స్థానంలో ఉంచిన ఘనత ముఖ్యమంత్రికి దక్కిందన్నారు. మెగా డీఎస్సీ ప్రకటిస్తాదునుకుంటే కేవలం 6100 పోస్టులకు డీఎస్సీ పోస్టులతో మెగా డీఎస్సీగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగ యువతను మోసం చేశారని రానున్న ఎన్నికల్లో నిరుద్యోగులు ఓటు ద్వారా వైసీపీకి బుద్ధి చెపుబుతారని అన్నారు.

నిబంధనలు పాటించాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 7: వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిబంధనలను పాటించాలని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని వేముగోడు గ్రామంలో ఆదోని సబ్ కలెక్టర్ పర్యటించారు. మండల భూముల రికార్డులన పరిశీలించారు. వ్యవసాయేతర భూములకు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని, వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకునేందుకు మార్కెట్ విలువ 5 శాతం కట్టాలని నిబంధనల ప్రకారం గ్రామసచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వాటిని నాలా యాక్ట్ ప్రకారం క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఆదోని మండలంలోని అరెకల్లు గ్రామంలో పోలింగ్ బూత్‌లను పరిశీంచారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతి, ఆర్ఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న కుంకనూరు గ్రామస్తులు

దేవనకొండ, ఫిబ్రవరి 7 : కుంకనూరు సర్పంచుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీవో ఇద్రూస్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ రూ. 5లక్షల నిధులతో గ్రామంలో కాకుండా గ్రామ సమీపంలో ఉన్న ప్రైవేటు వెంచర్‌లో డ్రైనేజీలు పనులు చేపడుతున్నారని గ్రామస్తులు తలారి రంగన్న, పరమేశ్, శంకరయ్య, శంకర్ రెడ్డి, స్టాలిన్, ఆశోక్, నాగరాజు, వీరేష్, గోసిమల్లి దేవనకొండ 1వ ఎంపీటీసీ శ్రీనివాసులు ఆరోపించారు. అలాగే గ్రామ వార్డు తీర్మానం లేకుండానే పనులు సాగిస్తున్నారన్నారు. సర్పంచ్ జి.ఈరమ్మ, పంచాయతీ కార్యదర్శి కుమ్మక్కై ప్రభుత్వ నిధులను దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. ఇద్దరిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మంత్రాలయం, ఫిబ్రవరి 7: నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రాలయం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మురళి అన్నారు. బుధవారం మంత్రాలయంలోని పరిమళ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర విధులు నిర్వర్తించే పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు జాగ్రత్తలు వహించాలన్నారు. అనంతరం నాలుగు స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి ఈవీఎంలు భద్రత పరచుకోవడానికి అనుకూలమైన ఏర్పాట్లు పోలీసు బందోబస్తుపై స్థానిక అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శశిశేఖర్‌రావు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు, సర్వేయర్ అబ్దుల్ వాహీద్, వీఆర్వో భీమన్నగౌడు, శ్రీరాములు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సిద్ధం : సబ్ కలెక్టర్



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

ఆదోని,ఆదోని రూరల్, ఫిబ్రవరి 7: పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేశామని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. బుధవారం బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేశామని, ఏదైనా సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, డిప్యూటీ తహసీల్దార్ రజనీ కాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

పత్తికొండ, ఫిబ్రవరి 7 : సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల సహకారం అవసరమని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో రాజకీయపార్టీలతో ఎన్నికలనిర్వహణ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఓటరు తుదిజాబితా దాదాపుగా సిద్ధమైందని మార్పులు చేర్పులు సరిచేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు విధుల్లో చేరుతున్నారని, పోలింగ్‌బూతులలో సమస్యలు, ఇబ్బందులు ఉన్నా తమదృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్డీవోతో పాటు తహసీల్దార్ మాధవరాజు ఉన్నారు.

ఓటరు జాబితాను పరిశీలించండి

కౌతాళం, ఫిబ్రవరి 7: ప్రభుత్వం ప్రకటించిన నూతన ఓటరు జాబితాను క్షేత్ర స్థాయిలో టీడీపీ క్లస్టర్, బూత్, కేఎస్ఎస్ ఇన్‌చార్జిలు వెళ్లి పూర్తి స్థాయిలో పరిశీలించాలని ఐటీడీపీ సభ్యులు రామాంజనేయులు, హరినాథ్ తెలిపారు. కౌతాళంలో క్లస్టర్-1 ఇన్‌చార్జి వెంకటపతిరాజు ఆధ్వర్యంలో ఐటీడీపీ నాయకులు క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలకు ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసీపీ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ, టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించాలన్నారు. టీడీపీ సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్, బూత్ ఇంచార్జిలు వెంకటపతిరాజు, కాశీవిశ్వనాథ్, రాజబాబు, మంజునాథ, సిద్దు, గిడ్డయ్య, రహిమాన్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి

మద్దికెర, జనవరి 7: గ్రామాల్లో సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంపీడీవో అలివేలమ్మ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామాల్లోని సంబంధిత సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు వెంకటేశ్వర్లు, గోవిందరాజులు, ఆదినారాయణ, మహేంద్ర, మనోజ్ ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మద్దికెర, జనవరి 7: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల విద్యాధికారి రంగస్వామి, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా తెలిపారు. బుధవారం మండలంలోని ఎం.అగ్రహారం జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఫరూక్, ఏఎస్ఎం గాయత్రీ తదితరులు ఉన్నారు.

బకాయిలను విడుదల చేయాలి

పత్తికొండ, ఫిబ్రవరి 7 : ఉద్యోగుల డిమాండ్స్‌ను వెంటనే పరిష్కరించి, డీఏ ఆరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలంటూ ఉద్యోగ జేఏసీ నాయకులు బుధవారం పత్తికొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనచేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు సాయిబాబా, వెంకటరమణ, రవికుమార్, వీరేష్, సుదర్శన్‌లు మాట్లాడుతూ జీపీఎఫ్ సరెండర్ బిల్లును వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో లక్ష్మికాంతరెడ్డి, రమేష్, రాజశేఖర్‌రెడ్డి, టిఎండి హుసేన్, జయరాముడు, ఇస్మాయిల్, సోమన్న, సందీప్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 7: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీ రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోడ్డు మీద నడిచేటప్పుడు ఎడమవైపు ఫుట్‌పాత్ మీదనే నడపాలని తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపే వాహనదారుడు రోడ్డు సంకేతాలను గమనిస్తూ, ఎడమవైపు మాత్రమే వెళ్లాలన్నారు. రోడ్డు క్రాస్ చేసేటప్పుడు కూడా ఎదుటి వాహనాలను గమనిస్తూ, నెమ్మదిగా రోడ్డు క్రాస్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ఎంఎఫ్ వేణుగోపాల్, ఎస్టీఐ రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించాలి

ఆదోని టౌన్, ఫిబ్రవరి 7: కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సరైన మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయం కావడానికి అవకాశం ఉందని ఆదోని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాణిశ్రీ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో పదిమంది కుష్టు వ్యాధిగ్రస్తులకు ఉపాధ్యాయుడు నిరంజన్ కుమార్. రూ.వెయ్యి విలువచేసే సమతుల ఆహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ ఎంపీహెచ్ఎస్ బాబూరాజు, సిబ్బంది లలితమ్మ, సుబ్బమ్మ బాయి, వీరేష్, టీచర్ ముకుంద పాల్గొన్నారు.

10న ఆంధ్ర, కన్నడ సాంస్కృతిక ఉత్సవం



మాట్లాడుతున్న కన్నడ సంఘం పెద్దలు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 7: ఆదోని డివిజన్‌లో ఉంటున్న కన్నడిగుల కోసం 10న స్థానిక వీరశైవ కల్యాణ మండపంలో ఆంధ్ర, కర్ణాటక సాంస్కృతిక ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆదోని కన్నడ సంఘం అధ్యక్షుడు శరణబసప్ప, ఉపాధ్యక్షుడు చంద్రన్న దేశాయ్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలోని కన్నడిగులలో ఐక్యత పెంపొందించే ఉద్దేశంతో కన్నడ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఈ ప్రాంతంలోని కన్నడ మీడియం విద్యార్థులకు సీబీఎస్ సీలబస్‌లో కేవలం ఇంగ్లీషుకే ప్రాధాన్యత ఉన్న కారణంగా కన్నడ మీడియంలో చదువుకున్న కన్నడిగుల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే రెండో లాంగ్వేజ్‌గా కన్నడ భాషను ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి సుగురప్ప, నాగేంద్రప్ప, కేఎం మల్లికార్జున స్వామి, కృష్ణమూర్తి, మరుళరాధ్య, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకోవడం హేయం

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 7: గ్రామ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో అమరావతిలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టిన సర్పంచులను అడ్డుకోని అరెస్టు చేయడం చాలా హేయమైన చర్య అని కర్నూలు పార్లమెంట్ తెలుగు మహిళ అధికార ప్రతినిధి శశిరేఖ అన్నారు. బుధవారం పెద్దకడబూరులోని స్వగృహంలో ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌ల నిధులు వెంటనే రిలీజ్ చేసి సర్పంచ్‌ల గౌరవాన్ని కాపాడాలన్నారు. సర్పంచులకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను కాలరాయడం దురదృష్టకరమన్నారు. గ్రామాల్లో స్థానిక సంస్థలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయడం చాలా బాధాకరమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సర్పంచులకు, ఎంపీటీసీలకు, జడ్పీటీసీలకు రూ. 10వేల గౌరవ వేతనం ఇస్తున్నట్లు ప్రకటించారన్నారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 7: ఎమ్మిగనూరు మండలంలో పనిచేస్తున్న ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆశా వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గురువారం తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమానికి ఆశా వర్కర్లు వెళ్తారన్న కారణంతో ముందస్తు అరెస్టు చేసినట్లు ఆశా వర్కర్లు తెలిపారు. ఈ సందర్భంగ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు శివలక్ష్మి, విశాలాక్ష్మి, రంగలక్ష్మి, నరసమ్మలతో పాటు సీఐటీయూ నాయకులు రాముడు మాట్లాడుతూ ముందస్తు అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపేదిలేదన్నారు.

పౌరసరఫరాల గోడౌన్ పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి 7: ఎమ్మిగనూరులోని ముగతి సమీపంలో ఉన్న పౌర సరఫరాల గోడౌన్‌ను ఆదోని సబ్‌కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఎమ్మిగనూరు తహసీల్దార్ శేషారెడ్డితో కలిసి పరిశీలించారు. బుధవారం స్థానిక రెవెన్యూ సిబ్బందితో గోడౌన్‌లో కార్డుదారులకు అందజేసే రేషన్ బియ్యం, బ్యాళ్లు, చెక్కెర వంటి వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గోడౌన్‌లో ఉన్న రేషన్ నిల్వలతో పాటు రికార్డులను పరిశీలించారు. కార్డుదారులకు రేషన్ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండ చూసుకోవాలని స్థానిక రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్ఐ లక్ష్మన్న, సిబ్బంది ఉన్నారు.

గోవా మద్యం పట్టివేత

తుగ్గలి, ఫిబ్రవరి 7: అక్రమంగా తరలిస్తున్న గోవా మందును సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. బుధవారం రాంపల్లె ఘాట్ రోడ్డులో కేపీ గుడిసెల మహేష్, ఆర్ఎస్ పెండేకల్ గ్రామానికి చెందిన భాస్కర్ 48 మ్యాన్షన్ హౌస్ 180 ఎంఎల్ గోవా మద్యంను తరలిస్తుండగా.. పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.